# ది గెస్ట్

## మల్లాది వెంకట కృష్ణమూర్తి



### THE STORY OF A MAN, A WOMEN AND A CHILD

*( ప్రథమ ప్రచురణ - నవంబర్, 1988)*

## *(గత సంచిక తరువాయి)*

### 3

**ఆ ఇంటి ఆవరణలో** కారు ఆగగానే పోలీస్ జవాన్ కారు తలుపు తెరిచాడు. ఇద్దరూ లోపలికి నడుస్తుంటే చెప్పింది ఆమె.

"మా నాన్నగారికి మరీ దగ్గరగా వెళ్ళకండి. ఆయన విస్కీ వాసన ఇట్టే పట్టేస్తారు"

"రండి" సివిల్ డ్రస్‌లో ఉన్న వీరభద్రరావు ఇద్దరినీ ఆహ్వానించాడు.

"ఎలా ఉన్నారు? కులాసానా?" అలకరించింది అనసూయ తల్లి అల్లుడు బెనర్జీని.

బదులుగా తలవూపాడు బెనర్జీ. అనసూయ తల్లితో లోపలకి వెళుతూంటే చెప్పాడు వీరభద్రరావు.

"మీ ఇద్దరు ఇరవై నాలుగు గంటలకోసారి కలుసుకున్నా, ఈ లోగా జరిగింది రెండురోజుల దాకా మాట్లాడుకుంటూనే ఉంటారు. పదమ్మ. డాక్టర్ వెయిట్ చేస్తుంటారు"

ఆయన కారులో డాక్టర్ దగ్గరకి బయలుదేరారు ముగ్గురు.

వీరభద్రరావు కూతురు అనసూయ ఆ డాక్టర్‌కి ఇదివరకే పరిచయం. బెనర్జీని పరిచయం చేసాడు వీరభద్రరావు.

అనసూయ్‌ని ఎగ్జామినేషన్ రూములోకి తీసుకెళ్ళింది డాక్టర్.

"రిపోర్ట్ రేపు సాయంకాలానికి వస్తుంది. రేపు రాత్రి ఏడు - ఏడున్నర మధ్య మీ ఇంటికి వస్తాను. ఉంటావుగా?" అడిగాడాయన, బెనర్జీని.

బెనర్జీ తలవూపాడు.

బెనర్జీ పనికూడా అయాక మళ్ళీ ముగ్గురూ ఇంటికి చేరుకున్నారు. వీడియోలో ఓ హిందీ సినిమాని పెట్టాడు వీరభద్రరావు. ఆ సినిమా చూస్తూ భోజనం చేయసాగారంతా. రాత్రి తొమ్మిదిన్నరకి వాళ్ళ దగ్గర శెలవు తీసుకున్నారు భార్యాభర్తలిదరు.

అనసూయకి మర్నాడు రాబోయే రిపోర్ట్ గురించి ఆలోచిస్తూంటేనే భయంగా ఉంది. ఎలాంటి విషయం వినాల్సివస్తుందోనని. బెనర్జీ అసలా సంగతే ఆలోచించడంలేదు.

మైత్రి గురించి ఆలోచిస్తున్నాడు

✷✷✷

మర్నాడు ఉదయం బెనర్జీ ఆఫీసుకి వెళ్ళేసరికి ఇంకా విశ్వం రాలేదు. ఒకతను బెనర్జీ కోసం ఎదురు చూస్తున్నాడు.

"ఏనయిందా?" అడిగాడు బెనర్జీ అతన్ని.

తలవూపి జేబులోంచి చిన్న ప్లాస్టిక్ పెట్టె తీసి బెనర్జీ కిచ్చాడతను మౌనంగా. అది టైప్ రైటర్‌కి ఉపయోగించే టైపింగ్ రిబ్బన్.

"మొత్తం టైప్ అయిందా?" అడిగాడు బెనర్జీ.

మళ్ళీ తల ఊపాడతను.

"ఇదెలా సంపాదించావు?" అడిగాడు బెనర్జీ.

"నిన్న టైప్ రైటర్‌ని రొటీన్‌గా చెక్ చేయడానికి వెళ్ళాను. యం.డి. టైప్ రైటర్‌ని చెక్ చేసి, రహస్యంగా పాత రిబ్బన్ తీసి ఈ కొత్త రిబ్బన్‌ని ఏర్పాటు చేసాను. టైప్ రైటర్‌కి ఉండాల్సిన ఓ బోల్ట్ జారిపోయిందని, అది మళ్ళీ తెచ్చివేస్తానని చెప్పాను. ఇందాక వెళ్ళి ఆ బోల్ట్ వేస్తున్నట్లు నటించి దాదాపుగా పూర్తయిన రిబ్బన్‌ని తీసి ఆ స్థానంలో మరోటి వేసాను."

"వెరీగుడ్" చెప్పాడు బెనర్జీ తృప్తిగా.

అతనికో అయిదువందల రూపాయలిచ్చి చెప్పాడు.

"కీపిటప్. మాకు ఎప్పటికప్పుడు సమాచారం కావాలి"

అతను తలవూపి వెళ్ళిపోయాడు.

బెనర్జీ టేబుల్ మీద ఉన్న టేప్ రికార్డర్‌ని ఆన్ చేసి ప్లాస్టిక్ పెట్టెలోంచి టైప్ రైటింగ్ రిబ్బన్ని తీసి, టేబు లేంప్‌ని వెలిగించాడు. ఆ వెలుతురులో టేప్‌ని ఉంచి ఆ కొత్త టేప్ మీద టైప్ ఐన అక్షరాలని చదివి మాటలని టేప్‌లో రికార్డ్ చేయసాగాడు. సరికొత్త టేప్ మీద ఒకేసారి టైప్ అవడంతో అక్షరాలన్నీ క్లియర్‌గా కనబడసాగాయి.

పారిశ్రామిక గూఢచర్యం - ఇండస్ట్రియల్ స్పయింగ్ భారత దేశానికి కొత్తే అయినా అరుదు కాదు. వ్యాపార సంస్థలు తమకి పోటీదారులయిన సంస్థలకి సంబంధించిన అనేక విషయాలని సేకరించడానికి ఇండస్ట్రియల్ స్పయిస్‌ని వాడుతుంటారు. పోటీ సంస్థలకి సంబంధించిన కాన్ఫిడెన్షియల్ ఇన్ఫర్మేషన్‌ని తెలుసుకోగలగడం ద్వారా ఎంతో లాభం పొందచ్చు. టెండర్‌లో వాళ్ళ కోటేషన్ తెలుసుకోగలిగితే వారికన్నా తక్కువ రేటుని కోట్ చేసే అవకాశం ఉంటుంది. వారు ముడి సరుకుని ఏ రేటుకి ఎవరినుంచి కొంటున్నారో తెలిస్తే అది తాము కొనే రేటుకన్నా తక్కువయితే బేరం ఆడచ్చు. ఇలాంటి ఎన్నో ఆర్థిక లాభాలు ఇండస్ట్రియల్ స్పయింగ్ వల్ల చేకూరతాయి.

బెనర్జీ తండ్రి ప్రవేశ పెట్టిన ఆ పద్ధతిని బెనర్జీ తన హయాంలో ఇంకాస్త అభివృద్ధి చేసాడు. అలాంటి సమాచార సేకరణకి అనేక కొత్త పద్ధతులని కనిపెట్టాడు. వాటిలో ఒకటి పోటీ కంపెని యం.డి సెక్రటరీ టైప్ రైటర్‌కి కొత్త టైప్ రిబ్బన్‌ని అమర్చి, టైప్ అయాక దాన్ని దొంగిలించడం.

పోటీదారుల రహస్యాలు తెలుసుకోవడం వల్ల బెనర్జీకి ఎంతో లాభం. మిగతా కంపెనీల సాఫ్ట్ డ్రింక్స్ ఫార్ములాలన్నీ అతనికి తెలుసు వాటికి డూప్లికేట్స్ తయారుచేసి, ఎవరికీ రుచిలో అనుమానం రాకుండా మార్కెట్లోకి ప్రవేశపెట్టాడు ఓసారి. ఆ మేరకు అతని ప్రత్యర్థి కంపెనీల అమ్మకాలు తగ్గాయి. ఏం జరిగిందో తెలుసుకోడానికి ఆ కంపెనీకి ఎనిమిది వారాలు పట్టింది. సంవత్సరంలో అతి ముఖ్యమైన రెండు నెలల సేల్స్ తగ్గడంతో ఆ కంపెనీకి సంవత్సరం లాభాల్లో ఆరోవంతు లాభం తగ్గుతుంది.

సహజంగా దూకుడు స్వభావంగల బెనర్జీ మరో పోటీ కంపెనీ విషయంలో ఇంకో ట్రిక్ చేసాడు. ఆ కంపెనీ తాలూకు ఖాళీ అయిన బాటిల్స్‌ని వివిధ దుకాణాల నుంచి తన ఏజెంట్ ద్వారా కొనిపించి, వాటిని బద్దలు కొట్టించాడు. బాటిల్స్ తక్కువవడంతో, వాటికి మళ్ళీ ఆర్డర్ ఇచ్చి, తయారు చేయించి తెప్పించుకునే సమయంలో ఆ బ్రాండ్ డ్రింక్ నగరంలో చాలా చోట్ల దొరకకపోవడంతో, ప్రత్యామ్నాయం అయిన బెనర్జీ కంపెనీ డ్రింక్‌కి సేల్స్ పెరిగాయి. పైగా ఆ బ్రాండ్ డ్రింక్ రెగ్యులర్‌గా దొరకదని షాపులవాళ్ళద్వారా బెనర్జీ

చెప్పించడంతో చాలామంది అతని కంపెనీ డ్రింక్‌ని తీసుకెళ్ళారు. వినియోగదారుల మనస్తత్వం దేనికి అలవాటుపడితే దాన్నే కొనసాగించడం. ఫలితంగా బెనర్జీ తయారుచేసే బ్రాండ్ డ్రింక్‌కి కొత్త కస్టమర్స్ ఏర్పడ్డారు. ప్రత్యర్థి కంపెనీ ఖాళీ బాటిల్స్‌ని కొని పగలకొట్టించడానికి బెనర్జీకి అయిన ఖర్చుకి మించిన లాభం ఆరోవారానికల్లా గడించాడు.

తన కంపెనీ డ్రింక్స్‌కి తప్ప మార్కెట్‌లో ఇతరుల డ్రింక్స్‌కి స్థానం ఉండకూడదన్నది బెనర్జీ ఆశయం. తనే నంబర్ వన్ అవాలనుకునే వాళ్ళందరికి ఒకటే దారి. మంచి ప్రొడక్ట్‌ని తక్కువ ధరకి ఇచ్చి వినియోగదారుల మన్నన పొందడం.

కాని తక్కువ కాలంలో ఎక్కువ విజయం పొంది నంబర్ వన్ అవాలనుకునే చాలామంది కృషికన్నా ఇలాంటి అడ్డదార్లని ఎన్నుకుంటూంటారు. వాళ్ళకి ముఖ్యం నంబర్ వన్ అనిపించుకోవడమే. అది తను పొందవలసిన రీతిలో పొందలేదన్న అసంతృప్తి వాళ్ళని నిత్యం తొలుస్తూనే ఉంటుంది. కాని బెనర్జీకి అది కూడా లేదు.

కొందరు పెద్దవాళ్ళకిలా అతనికి గమ్యం ముఖ్యం కాని మార్గం కాదు.

టేప్ రికార్డర్‌లో ఆఖరు పదం కూడా డిక్టేట్ చేసాక బెనర్జీ టైప్ రైటింగ్ రిబ్బన్‌ని డస్ట్ బిన్ లో పడేసి, టేబుల్ మీద ఉన్న టిష్యు పేపర్ బాక్స్‌లోంచి ఓ టిష్యూని తీసి చేతుల కంటిన రిబ్బన్ కున్న ఇంక్‌ని శుభ్రంగా తుడుచుకున్నాడు.

టేప్ రికార్డర్‌ని రీవైండ్ చేసి తను డిక్టేట్ చేసింది వినసాగాడు. వింటూ ముఖ్యమైన పాయింట్స్‌ని మధ్య మధ్యలో స్క్రిబ్లింగ్ పేడ్‌లో రాసుకోసాగాడు.

చివరలో విశ్వం లోపలికి వచ్చాడు.

టేప్ రికార్డర్‌ని ఆఫ్ చేసి అందులోంచి కేసెట్‌ని తీసి విశ్వానికిచ్చి చెప్పాడు.

"మొదటినుంచి విను. అమృత వాళ్ళు ఓ ఇంగ్లీష్ వీక్లీ సమ్మర్ స్పెషల్ సంచికతో అంగీకారాన్ని కుదుర్చుకున్నారు. ఆ పత్రికలోని లేబుల్‌ని కట్ చేసి ఇస్తే వాళ్ళ డ్రింక్ ఖరీదులో ప్రతి బాటిల్‌కి అర్ధరూపాయి రాయితీ ఇస్తారుట. ఇది మంచి కేంపైన్. వాళ్ళ డ్రింక్ తాగనివాళ్ళు కూడా ఎలావుంటుందో చూద్దామని, అర్ధరూపాయి తక్కువగా వస్తోందని కొనచ్చు. దాంతో ఆ పత్రిక సర్క్యులేషన్‌ని బట్టి ఏభై వేల బాటిల్స్‌ని అది విడుదలయిన వారంలో అమ్మగలుగుతారు. ఇది బోర్డ్ మీటింగ్‌లోని మినిట్స్‌తో ఓ ఐటం"

విశ్వం తల పంకించాడు.

"ఇది మంచి పబ్లిసిటీ కేంపైనే కాక, కొత్తవాళ్ళకి తమ ప్రొడక్ట్‌ని పరిచయం చేసేందుకు సరయిన దారి కూడా అవుతుంది. దీన్ని మనం ఎలాగైనా ఆపాలి" చెప్పాడు బెనర్జీ.

"ఆ ఎడిటర్‌తో మాట్లాడనా?" అడిగాడు విశ్వం.

"ఏం మాట్లాడతావు?" అడిగాడు బెనర్జీ.

"ఆ పబ్లిసిటీని అంగీకరించవద్దని. ఆ స్థానంలో మనది వేయమని. ఆ ఎడిటరేం ప్రొప్రయిటర్ కాడుగా. ఎంతో కొంత ముట్టచెపితే ఒప్పుకుంటాడు."

"ఇంకేదయినా ఆలోచించు. ఆ ఎడిటర్ ఒప్పుకోకపోగా ఈ సంగతి అమృత కంపెనీవాళ్ళకి చెప్పచ్చుగా."

బెనర్జీ కొన్ని క్షణాలు మౌనంగా ఆలోచిస్తుండిపోయాడు. అతనికి ఏదో మంచి ఆలోచన వచ్చిందని, అయితే దానికి ఏదో అడ్డు తగలడంతో దాన్ని పరిష్కరించడానికి ఆలోచిస్తున్నాడని గ్రహించగలిగాడు విశ్వం. మరి కొన్ని క్షణాల తర్వాత బెనర్జీ మొహంలోకి వెలుగు ప్రవేశించింది.

''ఇలా చేద్దాం. ఆ ఎడిటర్‌తో మాట్లాడాల్సిన అవసరం లేదు. ఆ పత్రిక ఎడ్వర్‌టైజింగ్ మేనేజర్‌తో మాట్లాడు. ఆ సమ్మర్ స్పెషల్‌లో మనం కూడా సరిగ్గా అమృత వాళ్ళిచ్చేలాంటి ప్రకటనే ఇద్దాం. అయితే చిన్న మార్పు. వాళ్ళు బాటిల్ మీద అర్థరూపాయి కన్సెషన్ ఇస్తామన్నారు. మనం రూపాయి ఇస్తాం.''

విశ్వం మొహంలో వెంటనే చిరునవ్వు.

''కరెక్ట్. ఆ పత్రిక కొన్న ఏ పాఠకుడూ అర్థరూపాయి కూపన్‌ని ఉపయోగించడు. రూపాయి కన్సెషన్ కూపన్‌తో డ్రింక్‌ని కొనాలనుకుంటాడు. దాంతో అమృత వాళ్ళు దానికోసం పెట్టిన ఖర్చంతా వృధా అవుతుంది. మనకి కొత్త కన్‌స్యూమర్స్ ఏడ్ అవుతారు'' చెప్పాడు విశ్వం.

''దట్సిట్. కూపన్స్ తీసుకుని రూపాయి తగ్గించుకుని డీలర్లంతా అమ్మే ఏర్పాట్లు చూడు. అయితే ఆ ఏర్పాట్లు పత్రిక ప్రింటింగ్ జరుగుతుండగా చేరాలి. ముందే చేస్తే అమృత వాళ్ళకి తెలిసి, తమ ప్రకటనని కేన్సిల్ చేయడమో, వాయిదా వేయడమో చేస్తారు. మనది, వాళ్ళది ఒకే పత్రికలో రావడం మనకెప్పుడూ ఎడ్వాంటేజ్'' చెప్పాడు. బెనర్జీ.

''అలాగే డీలర్లు మనకి ఎన్ని కూపన్స్ పంపితే అన్ని రూపాయలకి వాళ్ళకి క్రెడిట్ నోట్ పంపే ఏర్పాటు చేస్తాను'' చెప్పాడు విశ్వం.

''మనకి ఇమ్మీడియెట్ కాంపిటీటర్ అమృత. అనేక రకాలు వాళ్ళని ఎదుర్కొంటున్నాం. దీంతో మనం ఓ మెట్టు పైకి ఎక్కడమో లేదా కనీసం వాళ్ళు ఓ మెట్టు కిందకి దిగడమో జరిగి తీరాలి'' చెప్పాడు బెనర్జీ.

''నెక్స్ ఐటమ్ ఏమిటి?'' అడిగాడు విశ్వం.

''నెక్స్ ఐటం ఇది. ఇవాళ చాలా కష్టపడ్డాం. మిగతాది సాయంత్రమో, రేపో.''

నవ్వుతూ డ్రాయర్ లోంచి విస్కీ బాటిల్‌ని తీసాడు బెనర్జీ. విశ్వం లేచి రెఫ్రిజిరేటర్ దగ్గరకి వెళ్ళి సోడా సీసాలు ఖాళీ గ్లాసులు తెచ్చి టేబుల్ మీద ఉంచాడు.

విస్కీ తాగబోయే ముందు చిన్నగా నవ్వాడు బెనర్జీ. క్రమంగా అతని నిశ్శబ్ద దరహాసం పెరిగి పెద్దదయి శబ్దంతో కూడిన నవ్వుగా మారింది.

''వి డిడ్ ఇట్. అమృత యం.డి.కి తెలీకుండా అతన్ని నీట్‌గా బెల్ట్ కింద కొట్టాం. ఎక్కడ కొట్టాం?'' అడిగాడు బెనర్జీ విశ్వాన్ని.

''బెల్ట్ కింద''

''ఇలాంటి స్ట్రేటజీల్లో నువ్వు మహా గట్టివాడివి కాబట్టే ఈ స్థితికి వచ్చింది కంపెని'' చెప్పాడు విశ్వం.

తన విస్కీ గ్లాసుని విశ్వం విస్కీ గ్లాసుకి బలంగా తాకించి చెప్పాడు బెనర్జీ.

''అలాంటి మరో దెబ్బకి.''

గటగటా గ్లాసులోని విస్కీని తాగేసాడు.

* * *

''మైత్రి ఉద్యోగంలో జాయిన్ అయిందా?'' అడిగాడు బెనర్జీ విశ్వాన్ని మర్నాడు ఉదయం.

''నేనే చెపుదామనుకుంటూండగా నువ్వే అడిగావు. జాయిన్ అయింది'' చెప్పాడు విశ్వం నవ్వుతూ.

"మంచిది. స్టాండ్ బైగా ఉంటుంది. ఓ సారి నేను పిలుస్తున్నాని చెప్పు ప్రయివేటుగా ఆమెతో మాట్లాడాలి, అలాగే సింహాచలంతో చెప్పి ఆమె ఎక్కడుంటోందో ఎంక్వయిరీ చేయించు" చెప్పాడు బెనర్జీ.

అయిదు నిముషాల తర్వాత మైత్రి తలుపు తెరుచుకుని లోపలకి వచ్చింది. ఆమె రాకని గుర్తించనట్లు నటిస్తూ బెనర్జీ ఫైలులోని కాగితాలని సీరియస్‌గా చదవసాగాడు.

"పిలిచావుట?" అడిగింది మైత్రి.

తలెత్తి ఆమె వంక చూసాడు బెనర్జీ.

"అవును. కూర్చో" చెప్పాడు ఫైల్ మూసి.

మైత్రి అతని టేబుల్ ఎదురుగా ఉన్న విజిటర్స్ ఛెయిర్‌లో ఒద్దికగా కూర్చుంది. బెనర్జీ ఆమె వంక పరిశీలనగా చూసాడు గుండ్రటి మొహం ఛామన ఛాయ కన్నా రంగు ఓ పిసరు తక్కువ. 'నలుపులోనే అందం' అన్న సంగతి స్ఫురించేలాంటి మొహం

మైత్రి అతని చూపులని పసికట్టి పైటని పైకి లాక్కుంది.

"ఎందుకో పిలిచావుట?" అడిగింది.

బెనర్జీ ఆమె కళ్ళల్లోకి చూస్తూ అడిగాడు.

"ఇంతకాలం ఏమైపొయ్యావ్?"

ఆ ప్రశ్నకి సమాధానం చెప్పలేదామె.

"నువు నాకు ఎన్నిసార్లు గుర్తొచ్చావో తెలుసా? నువ్వంటే ఆ రోజుల్లో నేనెంత పిచ్చెక్కి పొయ్యేవాణ్నో తెలుసా? చెప్పలేనంత. కాబట్టి మాటల్లో చెప్పలేను."

అతని చూపులు ఆమె మెడని పరిశీలించాయ్.

"మంగళ సూత్రం తీసేసావా?" అడిగాడు మృదువుగా.

"ఎగతాళి తాళి ఏ ఆడదానికీ నచ్చదు గనక."

"ఛీ, ఛీ. ఎగతాళి తాళేంటి. అది వలపుల కేళి. నిన్ను ఇష్టపడే వివాహం చేసుకున్నాను ఆ సంగతి నీకు తెలుసు."

"అది ఇష్టంకాదు. మోహం."

ఆ మాటలు చెపుతూంటే మైత్రిలో బాధ తొంగి చూసింది కొన్ని క్షణాలు.

బెనర్జీ కాసేపు నిశ్శబ్దంగా ఉండిపోయాడు తర్వాత చెప్పాడు.

"ఐ స్టిల్ లవ్ యు."

మైత్రి మాట్లాడలేదు

"నేను ఉమనైజర్‌నే. కాని నీలా మళ్ళీ మళ్ళీ తరచు గుర్తొచ్చేలాంటి స్త్రీ నాకు మన పెళ్ళికి ముందుకి గాని, తర్వాతగాని తారసపడలేదు తెలుసా?"

"ఎందుకో పిలిచావుట?" అడిగింది మైత్రి.

"మనం ఇప్పుడు బాస్ - ఎంప్లాయిగా మాట్లాడటానికి పిలవలేదు నిన్ను. భార్యాభర్తలుగా మాట్లాడటానికి పిలిచాను. మంచికో చెడుకో కాలం మనల్ని మరోసారి దగ్గర చేసింది. ఐ స్టిల్ లవ్ యు. ఎంత ఆనందాన్నిచ్చేదానివో తెలుసా? రాత్రంతా ఆ అనుభవాన్నే నెమరు వేసుకుంటూ పడుకున్నాను. నెమరువేసుకున్న కొద్దీ అది కావాలనిపిస్తోంది."

మైత్రి వెంటనే లేచి నిలబడి చెప్పింది కోపంగా.

"ఇంకెప్పుడూ నాతో ఇలా మాట్లాడక. మీకు తెలిసిన ఆ మైత్రికి ఎప్పుడో దహన సంస్కారం అయిపోయింది. ఈ మైత్రి కొత్త జీవితం ఎత్తిన మైత్రి."

"మిగతా జీవితం అంతా అడవి కాచిన వెన్నెల్లా ఇలా వంటరిగా జీవిసావ్తా?"

"వెళతాను" లేచింది.

"నీ ఉద్యోగం రోజూ ఇలా నా ఎదురుగా కూర్చోవడమే అనుకో నీ కోసం ఓ మంచి ఇల్లు చూస్తాను."

మైత్రి నిప్పులు కక్కేలా చూసింది అతని వంక

"నీ అలవాట్లు మార్చుకో బెనర్జీ" బల్ల చుట్టూ తిరిగి మైత్రి దగ్గరకి వచ్చాడు. ఆమె ఎదిరిస్తున్నట్లుగా చూసింది.

"నేనంటే నీకు ప్రేమ కొద్దిగా కూడా మిగిలిలేదా?"

"అణుమాత్రం కూడా."

"ఎంత కర్కశురావిలివి?"

"ఓ స్త్రీని కర్కశురాలిగా మార్చగలిగేది ఒక్క మగాడే"

బెనర్జీ చేతుల్ని చాపాడు ఆమె నడుం చుట్టూ వేయడానికి. మైత్రి ఓ అడుగు వెనక్కి వేసి చెప్పింది.

"నన్ను తాకక."

"బెట్టు చెయ్యకోయ్"

చనువుగా ముందుకు నడిచాడు బెనర్జీ. అయిదారు అడుగులదాకా వెనక్కి వెళ్ళి ఆగి చెప్పింది మైత్రి.

"మిస్టర్ బెనర్జీ. బిహేవ్ యువర్ సెల్ఫ్"

బెనర్జీ ఒక్కొక్క అడుగే ఆమె వైపు వేస్తూ చెప్పాడు.

"ఈ గదిలోకి నే పిలిచేదాక ఎవరూ రారు. తలుపు తీసి ఉన్నా సరే. అలాంటి డిసిప్లిన్ మొదటి నుంచి ఉంది మైత్రి"

మైత్రి హేండ్ బాగ్ తెరచి అందులోంచి ఓ కాగితం తీసి చెప్పింది.

"ఈ కంపెనీ ప్రొప్రయిటర్ నువ్వే అని తెలియగానే రాజీనామా రాసి సిద్ధంగా ఉంచాను. ఇలాంటి సమయం వస్తుందనే. "

బెనర్జీ ఆగి చెప్పాడు ఆలోచించి.

"ఇట్సాల్‌రైట్. వెళ్ళు. నీ మనసు మారకుండా ఉండదు.

మైత్రి గుమ్మం దాకా వెళ్ళి ఆగి చెప్పింది.

"ఓసారి లేడీస్ టాయ్‌లెట్ లోకి వెళ్ళి చూడు. నీ ఆత్మకథని తలుపు మీద ఎవరో ఎంత చక్కగా రాసారో తెలుస్తుంది"

మైత్రి బయటకి వెళ్ళిపోయింది.

***

ఆ రోజు సాయంత్రం వీరభద్రరావు బెనర్జీకి ఫోన్ చేశాడు.

"నేను ఏడున్నరకల్లా ఇంటికి వస్తాను నువు ఇంట్లో ఉండు"

"సరే"

ఆయన టీ తాగాక బెనర్జీతో చెప్పాడు.

''అనసూయలో ఎలాంటి లోపం లేదని డాక్టర్ రిపోర్టులో తేలింది''

''వెరీగుడ్'' చెప్పాడు బెనర్జీ.

అనసూయ మొహం ఆనందంతో విప్పారింది.

''ఇక మిగిలింది నీ రిపోర్ట్'' చెప్పాడాయన.

''నీలో లోపం ఉందని పరిక్షలో తేలింది''

''ఏం లోపం?'' అనుమానంగా చూస్తూ అడిగాడు అతను.

''నీకు పిల్లలు పుట్టే అవకాశం లేదని''

''నో.నో. ఇంపాజిబుల్. దాంట్లో ఏదో తప్పుంది''

వీరభద్రరావు చిన్నగా నిట్టూర్చి చెప్పాడు.

''నేనూ ఆ మాటే డాక్టర్‌తో అన్నాను. ఇంకోసారి పరీక్షచేస్తానంది''

''తప్పకుండా. నాలో ఎలాంటి లోపం లేదు''

''నువ్వే చదువు''

జేబులోంచి రిపోర్ట్‌ని తీసి బెనర్జీ ముందు ఉంచి చెప్పాడు వీరభద్రరావు. బెనర్జీ ఆ కాగితాన్ని అందుకోలేదు. తన భార్య వంక చూసాడు. అనసూయ తలవంచుకుని ఉంది.

''మీరు చెప్పింది నమ్మలేకపోతున్నాను'' చెప్పాడు బెనర్జీ.

''అధికంగా ఆల్కహాల్, సిగరెట్స్ ఉపయోగించే వాళ్ళకి ఇలా అవుతుందిట. వాటిని మానేస్తే త్వరలో మళ్ళీ మామూలు అవచ్చుట''

వెంటనే నివ్వెరపోతూ చుశాడు.

''ఇంకో చోట పరీక్ష చేయిస్తే?'' అడిగాడు.

చిన్నగా నవ్వి చెప్పాడు వీరభద్రరావు.

''ఇలాంటివి ఓ పట్టాన ఏ మగాడు నమ్మలేడు. నీ ఇష్టం. రిపోర్టూ ఇలానే ఉంటే ఏం చేయాలో నీకు తెలుసుగా?''

బెనర్జీ ఆయన కళ్ళలోకి చుశాడూ. ఆయన ప్రశ్నకి బెనర్జీ కాని ఆయన కాని సమాధానం చెప్పలేదు.

వీరభద్రరావు వెళ్ళిపోయాక చెప్పింది బెనర్జీ తల్లి.

''శివాజ్ఞ లేనిదే చీమయినా కుట్టదంటారు. కాని ఆల్కహాల్, నికొటైన్ నీ వంట్లో కాపురం చేస్తున్నంత కాలం శివుడు ఆజ్ఞచేసినా నీకు సంతానం ఉండదు''

''నాకు బయట పనుంది'' చెప్పాడు బెనర్జీ కాసేపాగి భార్యతో.

''ఏం పని?''

''ఆఫీస్ పని''

''తాగుడు పని అని సూటిగా చెప్పరాదు? మీకు మా నాన్నగారు చెప్పింది విన్నాక మనసు దెబ్బతింది. అందుకు ఉపశమనం ఒక్క లిక్కర్ ద్వారానే కలుగుతుంది. ఆల్‌రైట్, వెళ్ళిరండి''

''నీ ఇష్టం వచ్చినట్టు మాట్లాడకు. అది తప్పు రిపోర్ట్''

"కాదని రుజువుచేయండి. రోజుకి నలభై సిగరెట్స్, నిద్రపోతున్నప్పుడు తప్ప మిగతా అన్ని సమయాల్లో ఆల్కహాల్.. అవునని ఋజువైంది"

బెనర్జీ బయటకి వెళ్ళిపోయాడు.

✷✷✷

మర్నాడు ఉదయం టీ బ్రేక్‌లో రోజులానే మైత్రి దగ్గరికి వచ్చింది అకౌంట్స్ సెక్షన్‌లో పనిచేసే సుజల.

"హలో, గుడ్ మార్నింగ్" విష్ చేసింది మైత్రి.

"గుడ్ మార్నింగ్" ప్రతిగా విష్ చేసింది సుజల.

"ఏమిటి సంగతులు?" అడిగింది మైత్రి.

"తిరుపతి వెళ్ళాలని శలవడిగితే ఇవ్వలేదు వెధవ"

"ఎవరు?" అడిగింది మైత్రి.

"ఇంకెవరు? మన ఫేక్టరీ శకుని మామ"

"ఎవరతను?"

"విశ్వనాథరావు. మన జి.యం. ఆయన, యం.డి. బాగా క్లోజ్. దాంతో శలవు కావల్సిన వాళ్ళకి ఇవ్వకుండా అనేక రకాలుగా ఉద్యోగస్తుల్ని ఏడిపిస్తుంటాడు. ఈ సంగతి బెనర్జీకి చెప్పాలంటే అందరికీ భయం. చెప్పినా ఉపయోగం లేదనుకో"

"విశ్వం గురించి అంతా అలాగే చెపుతున్నారు. అంత చెడ్డవాడా?" అడిగింది మైత్రి.

"ఎదుటి మనిషి కష్టపడటమే ఈయనగారికి సుఖం. మంచి ఉద్యోగం వచ్చి మా సెక్షన్‌లో ఒకాయన రాజీనామా చేసాడు. ఆయన ఎరియర్స్, ప్రావిడెంట్ ఫండ్ లోని మొత్తం నాలుగు నెలలుగా ఇవ్వకుండా ఏడిపిస్తున్నాడు."

"అలాగా!"

"ఫేక్టరీలో వాటర్ కూలర్స్ కొనాలని అంతా అభ్యర్ధన పంపాం. యం.డి. సేంక్షన్ చేశాడు. మధ్యలో విశ్వం అడ్డుపడి అది పడగొట్టాడు. లీవ్ ఎన్‌కేష్ మెంట్ సౌకర్యాన్ని తీయించేసాడు. ఉద్యోగస్తులు అరగంటదాకా అవసరం వచ్చి ఎక్కువ సేపు పనిచేస్తే ఇదివరకు ఓ.టి. ఉండేది. ఇప్పుడు గంటపని చేస్తేకాని ఓ.టి.లేదు. అరగంట ఉచితంగా పని చెయ్యాలి. ఉద్యోగస్తులకి నష్టం వచ్చేవి. ఇలాంటివి ఎన్నో చేశాడు. ఎంత ఛండాలుడంటే యూరినల్స్‌లో వాడే కలరా ఉండలు కూడా అనవసరపు ఖర్చని వాటిని కొనడం ఆపించేసాడు. ఆ యం.డి. ఎప్పుడూ తాగివుంటాడు. ఏం చెప్పినా సరిగ్గా అర్ధంకాదు. వీళ్ళకి తోడు సెక్యూరిటీ ఆఫీసర్ సింహాచలం ఒకడు. నిద్రపోయే సమయంలో తప్ప మిగతా సమయంలో ఫేక్టరీలోనే పడిచస్తాడు. అందరిమీదా నిఘా. మేనేజ్‌మెంట్ గురించి ఎవరయినా వ్యతిరేకంగా మాట్లాడుకుంటే చాలు తనకి తెలిసేలా గుఢచారుల్ని నియమించాడు"

మైత్రి ఆశ్చర్యంగా అడిగింది.

"దానివల్ల లాభం?"

"ఎవరయినా యూనియన్ పెడతారేమోనని"

"నాకు ఇందాక సరిగ్గా అలాంటి ఆలోచనే వచ్చింది. అసలు మనమంతా కలిసి యూనియన్‌ని ఎందుకు పెట్టకూడదు?"

ఆ దమ్ము ఎవరికుంది? యూనియన్ పెడదామనుకున్న వాళ్ళని ఉద్యోగంలోంచి తీసేస్తారు. ఎవరికి వారు మంచి ఉద్యోగం ఎప్పుడొస్తుందా ఎప్పుడు వెళ్ళిపోదామా అని ఆలోచిస్తుంటారు. ఇక్కడి తలరాతలని చక్కదిద్దాలనే కోరిక ఎవరికుంటుంది?"

"ఇవాళ రాత్రి ఈ విషయం గురించి గట్టిగా ఆలోచిస్తాను" చెప్పింది మైత్రి స్థిరంగా.

"రేపు ఉదయానికి నీ ఉద్యోగం ఊడుతుంది జాగ్రత్త" హెచ్చరించింది సుజల.

*(ఇంకా ఉంది)*

***

Post your comments




ఈ నవల క్రిందటి భాగం ఇంకా చదవలేదా..? లేక మళ్ళీ ఒకసారి చదువుదామనుకుంటున్నారా? వెంటనే కౌముది గ్రంథాలయాన్ని సందర్శించండి..

**Click here to go to KOUMUDI Library**